క్లుప్తంగా

ధ్యానంపై అవగాహన



ధ్యానంపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో ఎన్నో లాభాలు ఉన్నాయని విశాఖపట్నానికి చెందిన పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ సీనియర్ పిరమిడ్ మాస్టర్ రేవతి అన్నారు. స్థానికంగా ఆక్స్‌ఫర్డ్, అమర కౌముది, గాయత్రి విద్యా సంస్థలలో పనిచేస్తున్న టీచర్లకు ధ్యానంపై రెండురోజుల పాటు నిర్వహించిన అవగాహన కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధ్యానం చేయాలంటే శ్వాసమీద ధ్యాస ఉండాలని అన్నారు. ఆరోగ్య పరంగా ఆనందం, ఆలోచనల పరంగా మన వ్యక్తిత్వం మెరుగు పడుతుందని అన్నారు. కోపూరి బిందు మాధవి తదితరులు పాల్గొన్నారు.

నిత్య అన్నదానానికి విరాళం



విరాళ దాతకు జ్ఞాపికను అందజేస్తున్న ఈవో చంద్రశేఖర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో నిత్య అన్నదాన ట్రస్ట్‌కు రాజమహేంద్రవరానికి చెందిన వేదనభట్ల భాస్కర శర్మ, రామలక్ష్మి దంపతులు రూ.1,00,011 విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్‌కు సంబంధిత నగదును అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఈవో చంద్రశేఖర్ జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుని ఆలయానికి రెండు ఏసీలు వితరణ



విరాళ దాతకు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ ఆలయ కార్యాలయానికి రూ.లక్ష విలువ చేసే రెండు ఏసీలను విశాఖపట్నానికి చెందిన దుర్గా వైష్ణవి శనివారం అందజేశారు. వీటిని వెంటనే ఆలయ నూతన కార్యాలయానికి అమరుస్తున్నట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. విరాళ దాతకు ఈవో జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఇప్పిలి సాందీప శర్మ, జూనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, దాతల కుటుంబ సభ్యులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

జి.సిగడాం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని కొత్తపెంట యూపీ పాఠశాల హెచ్ఎం మజ్జి మదన్‌మోహన్ అన్నారు. శనివారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చేరాలని ప్రచారం చేశారు. అనంతరం పాఠశాల ఆవరణంలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాబోధన కోసం అనేక మౌలిక సదుపాయాలను కల్పించి ఉచిత విద్యను అందిస్తుందన్నారు. సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత, నాయకులు పున్నాన అక్కలనాయుడు మక్క నారాయణరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



కషాయాలను తయారు చేస్తున్న మహిళా రైతులు

ఎచ్చెర్ల: ఉడుకు తెగుళ్ల రాకుండా పంటలో కషాయాలను వాడాలని ప్రకృతి వ్యవసాయం తమ్మినాయుడుపేట యూనిట్ ఇన్‌చార్జ్ చంద్రకళ సూచించారు. కొత్తపేట గ్రామంలో పంటలకు ఉడుకు తెగులు సోకడం వల్ల వచ్చే నష్టాలను వివరించారు. తెగుళ్ల నివారణకు ఉపయోగించే వావిలాకు, తూటికాడ కషాయాలను తయారుచేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పసుపు, తెలుపు పళ్లాలు, లింగాకర్షక బుట్టలు పెట్టుకుని తద్వారా తెగుళ్లు, పురుగులను గమనించి సరైన సమయంలో కషాయాలను వాడాలన్నారు. మహిళా రైతులు పాల్గొన్నారు.

నారాయణ తిరుమలలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న నారాయణ తిరుమల వేంకటేశ్వరుడు



పూలమాల అలంకరణలో కల్యాణ వెంకన్న



మొండేటివీధిలో ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

శ్రీకాకుళం కల్చరల్:

పీఎన్‌కాలనీలోని నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తరశతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. వెంకట రామానుజ సేవాశం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. అలాగే పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామిని ప్రత్యేకంగా పూలమాలతో అలంకరణ చేశారు. అర్చకులు బూరాడ వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు జరిపారు. ఉత్సవ మూర్తులకు కూడా ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మొండేటివీధిలో..

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధి ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారిని అందంగా అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామాలతో అర్చనలు జరిపారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటా..



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

- ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దని, ఎటువంటి సమయంలోనైనా అండగా ఉంటానని ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాతర్లపల్లి గ్రామంలో లావేరు మండల నాయకులు, కార్యకర్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో సహకరించి ఓట్లు వేసిన ఎచ్చెర్ల నియోజకవర్గ ప్రజానీకానికి, నాయకులకు, కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి నాయకులు రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని కార్యకర్తలందరూ సమన్వయం పాటించాలని కోరారు. కార్యకర్తలకు వెన్నుదన్నుగా తనతోపాటు మండల, నియోజకవర్గ నాయకులు ఉంటారన్నారు. ప్రజల తరఫున నిరంతరం పోరాడుదామని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత కుటమి నాయకులు ప్రకటించిన హామీలు అమలు చేయకపోతే ప్రజాక్షేత్రంలో నిలదీద్దామన్నారు. లావేరు మండల ప్రత్యేక అహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతంనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు దన్నాన రాజినాయుడు, నాయకులు మీసాల శ్రీనివాసరావు, లుకలాపు శ్రీనివాసరావు, అలుపన నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరిని కలిసిన ఎమ్మెల్యే



పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఢిల్లీలో శనివారం కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యేను పురందేశ్వరి అభినందించారు. ఎంపీగా ఎన్నికైన పురందేశ్వరికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల: మండలంలోని ఎచ్చెర్ల గ్రామంలోని వేంకటేశ్వర ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఇక్కడ ఉన్న భజన బృందం వారు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోవాలి



ఏఓ శారద

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన విత్తనాల కోసం ఆన్‌లైన్‌లో సంబంధిత రైతుల పేర్లును నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి యర్రా శారద శనివారం తెలిపారు. కిలో విత్తనాలకు రూ.10ల రాయితీ ఉంటుందన్నారు. రైతుల పేర్లను సంబంధిత గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. వారం రోజుల్లో విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు.

దాతల సాయంతో ఆలయ నిర్మాణం



నిర్మాణ పనులు చేపడుతున్న దృశ్యం

ఎల్.ఎన్.పేట: మండలంలోని మల్లికార్జునపురం వద్ద ఉన్న వంశధార పునరావాస కాలనీలో దాతల సాయంతో ఉమామల్లేశ్వర స్వామి దేవాలయ నిర్మాణం చేపడుతున్నారు. నిర్వాసితులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన పలువురు దాతలు ఇచ్చిన విరాళాలతో దేవాలయం నిర్మిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. దేవాలయ నిర్మాణ కోసం మరింత మంది దాతలు విరాళాలు అందజేయాలని కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

సరుబుజ్జిలి: సీజనల్‌గా వ్యాపించే వ్యాధుల పట్ల క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి ఎం.సంతోష్‌కుమార్ తెలిపారు. మండలంలోని పాలవలస, రావివలస, కొండవలస గ్రామాల్లో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాలు కురుస్తున్నందున కలుషితనీరు, అపరిశుభ్రమైన వాతావరణం వల్ల డయేరియా ప్రబలే ప్రమాదముందన్నారు. వైద్య సిబ్బంది ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి తనిఖీలు చేయాలని సూచించారు.

రామోజీరావు మృతికి సంతాపం



శ్రీకాకుళం అర్బన్: రామోజీరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత సీహెచ్ రామోజీరావు మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. ఆయన మృతికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతల సంఘం జాతీయ అధ్యక్షుడు చౌదరి రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు డీపీ స్టాలిన్, ప్రధాన కార్యదర్శి కొమ్మన పురుషోత్తం, కార్యదర్శి పారుపల్లి రామరాజు, కోశాధికారి కొప్పల సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు కుదమ తిరుమలరావు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

శ్రీకాకుళం అర్బన్: రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులు అన్నారు. శ్రీకాకుళంలోని లయన్స్‌క్లబ్ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, అధ్యక్షులు పొన్నాడ రవికుమార్, జోన్ చైర్మన్‌డాక్టర్ బాడాన దేవభూషణరావు, ఇంటాక్ కో-కన్వీనర్ వావిలిపల్లి జగన్నాథనాయుడు తదితరులున్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: రామోజీరావు అలుపెరగని అక్షర యోధుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని బీజేపీ నాయకులు అన్నారు. రామోజీరావు అకాల మరణానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, అట్టాడ రవిబాబ్జీ తదితరులు సంతాపం తెలియజేశారు.

రణస్థలం: ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీ రావు మృతి పట్ల ఎచ్చెర్ల ఎన్‌డీఏ కూటమి నాయకులు సంతాపం తెలిపారు. మండలంలోని బంటుపల్లి గ్రామంలోని ఎచ్చెర్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రామోజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు



గుత్తావల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఎంఈఓ-2 ధనుంజయరావు, ఉపాధ్యాయులు

బూర్జ: భవిత కేంద్రాల్లో ప్రత్యేకావసరాల చిన్నారులకు ఉత్తమ బోధనతోపాటు జీవన నైపుణ్యాలు అలవర్చుకోడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని ఎంఈఓలు ఎస్.శ్యామసుందరరావు, బి.ధనుంజయరావు అన్నారు. మండలంలో ప్రత్యేకావసరాల చిన్నారులను గుర్తించేందుకు మే 1 నుంచి జూన్ 9వ తేదీ వరకు సర్వే ఉంటుందన్నారు. శనివారం గుత్తావల్లి గ్రామంలో సర్వే చేపట్టారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతానికి 38 మంది చిన్నారులను గుర్తించినట్లు ఎంఈఓలు తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ, ప్రభుత్వం ద్వారా ఉపకరణాలు అందజేస్తామన్నారు. జిల్లా సహిత సమన్వయకర్త బి.గోవిందరావు ఆధ్వర్యంలో బుద్ధి మాంద్యం, వినికిడి సమస్య ఉన్న చిన్నారులకు చెవిటి మిషన్లు, చక్రాల కుర్చీలు అందజేయనున్నట్లు తెలిపారు. సహిత విద్యా ఉపాధ్యాయులు డి.రమణ, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



రైల్వే అధికారులకు వినతిపత్రం అందిస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: పాపతట్నం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బి.నారాయణమూర్తి కోరారు. విశాఖపట్నంలో రైల్వే డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాతపట్నం రైల్వే స్టేషన్‌లో కనీస వసతులు లేక ప్రయాణీకులు ఇబ్బందులు పడేవారన్నారు. దీనిపై గతంలో ఆనాటి అధికారులకు విన్నవించామన్నారు. అధికారులు టెక్కలి, పాతపట్నం రైల్వే స్టేషన్ల అభివృద్ధికి రూ.1.20 కోట్లు మంజూరు చేశారన్నారు. టెక్కలి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు పూర్తికావచ్చాయన్నారు. పాతపట్నంలో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను కోరానన్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌పై అవగాహన అవసరం

శ్రీకాకుళం అర్బన్: బ్రెయిన్ ట్యూమర్‌పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మెడికవర్ ఆస్పత్రి కన్సల్టెంట్ న్యూరోసర్జన్ డాక్టర్ మురళీధరరావు అన్నారు. ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రిలో శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రెయిన్ ట్యూమర్ వంటి తీవ్రమైన సమస్య గురించి ప్రజలు తెలుసుకోవడం ద్వారా దానిని నివారించవచ్చునన్నారు. బ్రెయిన్‌లోని కణితుల సమీపంలో కణజాలం, నిర్మాణాలలో వచ్చే గడ్డలు, కణాల పెరుగుదలనే బ్రెయిన్ ట్యూమర్స్ అంటారని వివరించారు. వీటిలో కొన్ని కాన్సర్స్‌తో సంబంధం లేనివి, మరికొన్ని కాన్సర్‌తో సంబంధం ఉన్నవి ఉంటాయన్నారు. బ్రెయిన్ ట్యూమర్ సమస్య రోజురోజుకూ పెరుగుతోందని, దీర్ఘకాలం పాటు రేడియేషన్‌కు గురయ్యేవారు, పొగతాగే వ్యక్తుల్లో ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువ ఉంటాయన్నారు. సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం తప్పదన్నారు. ఏ మాత్రం అనుమానం వచ్చినా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

మండలానికి 8 వేల పాఠ్య పుస్తకాలు



ఎంఈఓ-1 శ్యామసుందరరావు

బూర్జ:

మండలానికి 1 నుంచి 10వ తరగతి వరకు 8 వేల పుస్తకాలు అందినట్లు ఎంఈఓ-1 ఎస్.శ్యామసుందరరావు తెలియజేశారు. మండల కేంద్రంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. 8 నుంచి 10వ తరగతికి నేరుగా అనకాపల్లి నుంచి పూర్తిస్థాయిలో పుస్తకాలు అందజేయడం జరిగిందన్నారు. 1 నుంచి 7వ తరగతికి జిల్లా స్థాయి నుంచి అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి నుంచి ప్రస్తుతానికి 5 వేలు మాత్రమే అందినట్లు తెలిపారు. మండలానికి 15 వేల వరకు పుస్తకాలకు ఇండెంట్ పెట్టడం జరిగిందన్నారు. ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువకులతో నాయకులు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మండల జనసేన నాయకుడు దుక్క బాలరాజు ఆధ్వర్యంలో జెమ్స్ వైద్యులతో రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరాలను శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో 21 మంది యువకులు రక్తదానం చేశారు. 270 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు బాలరాజు తెలిపారు. జెమ్స్ ఆసుపత్రి వైద్యులు, బీజేపీ పాతపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి సలాన శరత్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ రికార్డుల ఆడిట్



స్కూల్ రికార్డులను ఆడిట్ చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న స్కూళ్లలో నిర్వహించిన సివిల్ వర్క్స్, మెయింట్‌నెన్స్ నిధుల వినియోగంపై ఆడిట్ చేయించుకోవాలని ఆడిట్ అధికారి ఎం.సురేష్ కుమార్ తెలిపారు. శనివారం నరసన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆడిట్ నిర్వహించారు. నాలుగు మండలాల్లోని 44 స్కూళ్లకు చెందిన హెచ్ఎంలు వచ్చి ఆడిట్ చేయించుకున్నారని, మిగిలిన వారు కూడా వచ్చి ఆడిట్ చేయించుకోవాలన్నారు.

జీడిపిక్కలకు మద్దతు ధర కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరావు

పలాస: జీడిపిక్కలకు గిట్టుబాటు ధర కల్పించాలని, 80 కిలోల జీడిపిక్కల బస్తాను రూ.16 వేలకు కొనుగోలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి.మాధవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస మండలం నీలావతి గ్రామంలో రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది జీడి పంట దిగుబడి బాగా తగ్గిందని, వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. విదేశీ జీడి పిక్కల దిగుమతిని ఆపి ఉద్దానం ప్రాంతంలోని జీడి పిక్కలను కొనుగోలు చేయాలని, తగిన గిట్టుబాబు ధర కల్పించాని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు జుత్తు వీరాస్వామి, వంకల పాపయ్య, కోదండరావు, రామారావు పాల్గొన్నారు.

పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి



చొట్రాయిపురంలో తల్లిదండ్రులను కలిసిన హెచ్ఎం తిరుపతిరావు

కంచిలి: చక్కని విద్యాబోధన, పిల్లలకు కావల్సిన అన్ని విద్యా ఉపకరణాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే బడిఈడుకు వచ్చిన పిల్లల్ని చేర్పించాలని చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మద్దు తిరుపతిరావు కోరారు. ఈ మేరకు విద్యాశాఖ సూచించిన స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని జలంత్రకోట పంచాయతీ పరిధి చొట్రాయిపురం పాఠశాల పరిధిలో గ్రామాల్లో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులను వాళ్ల ఇళ్ల వద్దకు వెళ్లి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ కర్రి సుందరరావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

విత్తన రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



సోంపేట ఆర్‌బీకేలో రాయితీ నమోదును పరిశీలిస్తున్న అధికారులు

సోంపేట: రైతులు ఖరీఫ్ కాలంలో ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ద్వారా అందజేస్తున్న వరి విత్తన రాయితీని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ సహాయకులు కె.జగన్మోహనరావు, వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో నిర్వహిస్తున్న విత్తన రాయితీ నమోదు కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారులు రైతులతో మాట్లాడుతూ.. 150 ఎకరాలకు గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా ఇంద్ర, ఎంటీయూ 1318, వరి రకాల మూల విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ నెల ఐదు తేదీ నుంచి రైతు భరోసా కేంద్రాల్లో జాతీయ ఆహార భద్రత మిషన్ రాయితీ కింద కేజీకి పది రూపాయలు చొప్పున రాయితీ ఇచ్చేందుకు రైతు నమోదు ప్రక్రియ చేపడుతున్నామన్నారు. తెగుళ్లకు గురయ్యే స్వర్ణ, సాంబమసూరిని పండించే స్థానంలో ఎంటీయూ 1318, ఎంటీయూ 1224 రకాల విత్తనాలు అందజేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు వెయ్యి క్వింటాళ్ల వరకు అవసరమని రైతులు పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు.చిన్న, సన్నకారు రైతులకు, షెడ్యూలు కులాలు, తెగల రైతులకు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ సహాయకులకు సూచించామన్నారు. మొలక శాతం పరిశీలించి తర్వాత రైతులకు విత్తనాలు అందజేస్తామన్నారు.

'పలాసను అభివృద్ధి చేస్తాం'

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని టీడీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గౌతు శ్యాంసుందర శివాజీ అన్నారు. తన కుమార్తెను గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. పలాసలో టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు లొడగల కామేశ్వర రావు, వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్ రావు, దువ్వాడ శ్రీకాంత్, గాలి క్రిష్ణారావు, బడ్డ నాగరాజు, అంబటి క్రిష్ణమూర్తి, డొక్కరి శంకర్, సప్ప నవీన్, యవ్వారి మోహనరావు ఉన్నారు.

